

జైపూర్ మండలం ఇందారం శివారులో ఎండిపోయి ఎడారిని తలపిస్తున్న గోదావరి

## ఎల్లంపల్లి నీరు వదిలినా ప్రయోజనం లేదు



ఎల్లంపల్లి నుంచి నీటి విడుదల ద్వారా చెన్నూర్ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు. అసెంబ్లీలో చెన్నూర్ ఎమ్మెల్యే మాట్లాడిన తీరు ఆశ్చర్యానికి గురిచేసింది. సుందిళ్ల ప్రాజెక్టులో నీటిని నింపడంతో ప్రయోజనం ఉంది. గత ప్రభుత్వం హయాంలో జైపూర్ మండలంలోని శెట్‌పల్లి దగ్గర లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. సర్వే పనులు సైతం పూర్తయి, పనులు మొదలయ్యే సమయానికి ప్రభుత్వం మారింది. ఎమ్మెల్యే వివేక్ లిఫ్ట్ ఇరిగేషన్‌పై దృష్టి ఉంచి పనులు ప్రారంభిస్తే నియోజకవర్గంలోని 102 గ్రామాలకు సాగు నీరు అంది, రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. అలా కాకుండా ఎల్లంపల్లి నుంచి రెండు టీఎంసీలు వదిలితే చెన్నూర్ రైతులకు వచ్చే లాభం ఏమీలేదు.

*- మేడి సునీత, రైతు జైపూర్*

## ప్రాజెక్టు పూర్తి చేయడంపై దృష్టిపెట్టాలి



గోదావరిలో నీళ్లు వదిలితే మాకు వచ్చేది ఏం ఉండదు. ఇప్పటికే చాలా గ్రామాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. గోదావరిలో నీళ్లు వదిలితే ఏ కాలువలతో పొలాల్లోకి నీరు వస్తాయి. రెండు టీఎంసీల నీరు మొత్తం ఎండిపోయిన గోదావరిని తడపడానికే సరిపోతది. చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం తెస్తేనే చెన్నూర్ సస్యశామలం అవుతది. దానికి కావాల్సిన నిధులు తేవడంపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి. అప్పుడు గానీ రైతుల ఇబ్బందులు తీరవు.


*- చల్లూరి బాపు, రైతు ధర్నారం గ్రామం, భీమారం మండలం*

# నీళ్లు కాదు..

> చెన్నూర్ ఎత్తిపోతలకు నిధులిచ్చి పూర్తిచేస్తేనే గోదావరి నీళ్లు పంటలకు అందుతాయి

# నిధులు కావాలే..

- బీఆర్ఎస్ సర్కారు హయాంలో ప్రాజెక్టుకు శంకుస్థాపన
- కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలిచాక అటకెక్కిన పథకం
- పక్కా నియోజకవర్గాలకు నిధులిచ్చి చెన్నూర్‌కు ఎందుకు ఇవ్వరు ?
- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా ?
- లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేయడంపై ఎమ్మెల్యే దృష్టి సారించాలంటున్న రైతన్నలు



నీరు సరిపోక ఇందారంలో ఎండిపోతున్న వరి చేను


మంచిర్యాల, మార్చి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'చెన్నూర్ నియోజకవర్గంలో నీళ్లు సరిగా లేవు. పంటలు ఎండిపోతున్నాయి. రెండు టీఎంసీల నీళ్లు ఎల్లంపల్లి నుంచి చెన్నూర్ నియోజకవర్గానికి విడుదల చేయాలి' అని మంత్రిని రిక్వెస్ట్ చేశానంటూ చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ మొన్న అసెంబ్లీలో మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. వాస్తవానికి గోదావరి పక్కనే ఉన్నా చెన్నూర్ నియోజకవర్గంలో గోదావరి నీటిపై ఆధారపడి పంటలు సాగు చేయరు. గోదావరి నీరు ఉంటే మోటార్లు పెట్టి తోడుకోవడం తప్ప పంటలకు నీళ్లు ఇచ్చే ప్రత్యేక కెనాల్ సిస్టమ్ ఏమీ లేదు. బీఆర్ఎస్ హయాంలో గోదావరి నిండుకుండలా ఉంటే ఈ నీటిని మోటార్లతో తీసుకోవడానికి అవకాశం ఉండేది. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండి బోర్ల కింద పంటలు పండించే వీలుండేది. కానీ ఇప్పుడు గోదావరిలో నీళ్లు లేవు. కాళేశ్వరం పిల్లర్ బాగు చేయలేక కహానీలు చెబుతున్న కాంగ్రెస్ సర్కార్.. ఆ సాకును చూపి అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లను నింపడం లేదు. దీంతో చెన్నూర్ నియోజకవర్గంలో ఒకప్పుడు నీటితో కళకళలాడిన గోదావరి, ఇప్పుడు నీళ్లు లేక ఎండిపోయింది. ఒక వేళ ఎమ్మెల్యే కోరికపై ఎల్లంపల్లి నుంచి రెండు టీఎంసీల నీటిని విడుదల చేసినా ఎండిపోయి ఉన్న గోదావరి గొంతు తడపడానికే సరిపోతాయి. ఆ నీరు పంట పొలాలకు వస్తుందన్న గ్యారెంటీ లేదు. గోదావరిలో నీరు లేక జైపూర్ మండలంతో పాటు చెన్నూర్ రూరల్ మండలంలోని కొన్ని ప్రాంతాల్లో పంట పొలాలకు నీరు సరిపోవడం లేదు. బోర్లతోనైనా సాగు చేద్దామంటే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. ఈ విషయంలో రైతులు ఇప్పటికే దిగులుపడుతుంటే 'గోరు చుట్టుపై రోకలిపోటు' అన్న చందంగా ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మాకు కావాల్సింది గోదావరిలో నీళ్లు కాదు.. చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తి చేయడం' అని కుండబద్దలు కొడుతున్నారు. ఇప్పటికైనా దీనిపై ఎమ్మెల్యే దృష్టి సారిస్తే మంచిదంటూ పెదవి విరుస్తున్నారు.

### చెన్నూర్ లిఫ్ట్‌తోనే నీటి కష్టాలకు మోక్షం

తెలంగాణ జీవధార కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి రూ.1658 కోట్లతో మూడు లిఫ్టుల ద్వారా చెన్నూర్ నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందించే చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి గత ఎమ్మెల్యే బాల్క సుమన్ హయాంలో శంకుస్థాపన చేశారు. లిఫ్ట్-1 కింద జైపూర్ మండలం శెట్‌పల్లిలో నిర్మించే పంప్‌హౌస్ ద్వారా పొన్నారం, శంకరపల్లి, గంగపల్లి చెరువులను నింపుతూ 43.35 కిలోమీటర్ల కాలువ నిర్మించాలనేది ప్రతిపాదన. దీంతో జైపూర్ మండలంలోని 21 గ్రామాలతో పాటు మంద్రమర్రిలోని 6 గ్రామాలకు మొత్తంగా 27 గ్రామాల్లోని 25,422 ఎకరాలు సాగునీరు అందేది. లిఫ్ట్-2 కింద అన్నారం సరస్వతీ బ్యారేజ్ నుంచి చెన్నూర్ సోమన్‌పల్లిలో పంప్‌హౌస్ ద్వారా ఆరేపల్లి, ఆస్నాద్, రెడ్డిపల్లి చెరువులను నింపుతూ 63.30 కిలోమీటర్ల ప్రధాన కాలువ నిర్మించాలి. తద్వారా చెన్నూర్ మండలంలోని 13 గ్రామాలు, కోటపల్లి మండలంలోని 9 గ్రామాలు మొత్తంగా 52 గ్రామాల్లోని 48,208 ఎకరాలకు సాగునీరు అందుతుంది. లిఫ్ట్-3 కింద మేడిగడ్డ ప్రాణహిత నదిపై నిర్మించే లక్ష్మీ బ్యారేజ్ నుంచి కోటపల్లి మండలం ఆల్గంలో నిర్మించే పంప్‌హౌస్‌తో శంకరాపూర్, ఆయపల్లి చెరువులను నింపుతూ 35.55 కిలోమీటర్ల ప్రధాన కాలువలు నిర్మించాలి. దీని కింద కోటపల్లి మండలంలోని 24 గ్రామాల్లో 16,370 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అంటే దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందించే మహత్తర అవకాశం చెన్నూర్ లిఫ్ట్‌తో ఉంటుంది.

### గతంలో ప్రతిష్టాత్మకం.. ఇప్పుడు పట్టింపులేని తనం..

గతంలో బాల్క సుమన్ ప్రభుత్వ విప్‌గా, చెన్నూర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు తెచ్చారు. రోడ్లు లేని పల్లెలకు రోడ్లు వేయించారు. వాగులు, వంకలపై బ్రిడ్జిలు నిర్మించారు. ఇక రైతుల కోసం ఏమైనా చేయాలని పట్టుబట్టారు. ఇరిగేషన్ అధికారులతో సంప్రదింపులు చేసి చెన్నూర్ నియోజకవర్గ నీటిగోస తీర్చే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు అంకురార్పణ చేశారు. తన ఆలోచన సీఎం కేసీఆర్‌తో చెప్పి సర్వే కోసం రూ.8.88 కోట్లు మంజూరు చేయించారు. 2020 జూన్ ఒకటిన సర్వే పనులను ప్రారంభించి, నిర్దేశించిన గడువులోపు సర్వే పనులను పూర్తిచేయించారు. ఆ రిపోర్ట్‌ను ప్రభుత్వానికి సమర్పించి 2022 ఏప్రిల్ 12న సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో రూ.1658 కోట్ల చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు మంజూరు చేయించేందుకు ఒప్పించారు. ఈ మేరకు 2023 జూన్ 9న మంచిర్యాలకు వచ్చిన సీఎం కేసీఆర్‌తో శంకుస్థాపన చేయించారు. ఈ లోగా ఎన్నికలు వచ్చాయి. చెన్నూర్‌లో హస్తం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా వివేక్ గెలిచారు. అప్పటి వరకు చకచకా సాగిన చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్.. కాంగ్రెస్ ఎమ్మెల్యే గెలిచాక పట్టించుకునే నాథుడే లేక మరుగున పడ్డాయి. చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌ను పక్కనపెట్టి.. గోదావరికి ఆ వైపున ఉన్న మంథని నియోజకవర్గంలో రూ.571.57 కోట్ల చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టింది. ఇంత జరుగుతున్నా సర్వే పూర్తై, శంకుస్థాపన చేసిన చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వకుండా చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు నిధులు ఇస్తుంటే ఎమ్మెల్యే నోరు మెదపడం లేదు. పొరుగున ఉన్న నియోజకవర్గాల్లో సాగునీటి ప్రాజెక్ట్‌ల కోసం నిధులు ఇస్తుండే మా ప్రాంతానికి ఎందుకు ఇవ్వరు ? అని అడగకుండా గోదావరి నీళ్లు విడుదల చేయాలని కోరడం ఏమిటని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలోని పంట పొలాలను సస్యశామలం చేసే చెన్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తయిందని, ఆ ప్రతిపాదనలు పరిశీలించి ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తీసుకురావాలని కోరుతున్నారు. మరి ఇప్పటికైనా ఎమ్మెల్యే సార్ ఈ విషయంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.



చెన్నూర్ లిఫ్ట్-1, లిఫ్ట్-2, లిఫ్ట్-3 నమూనా చిత్రాలు



భట్టుపల్లిలో మురుగు కాలువను పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# కాంగ్రెస్ పాలనలో గాడితప్పుతున్న గ్రామాలు

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

కాగజ్‌నగర్, మార్చి 25: కాంగ్రెస్ పార్టీ పాలనలో గ్రామాలు గాడితప్పుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. సమస్యలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాలు ఆగమవుతున్నాయన్నారు. సర్పంచులు లేక పోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాక కనీసం వీధి దీపాలు ఏర్పాటు చేసే పరిస్థితి లేదన్నారు. పారిశుధ్య నిర్వహణ లేకు మురుగు కాలువలు అధ్వానంగా మారాయన్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ పోసే పరిస్థితి లేదని, పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంలో ముఖ్యమంత్రికే స్పష్టత లేదన్నారు. మౌలిక వసతులు కల్పించకుండా పన్నులు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. తుంగమడుగు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత ఆరు నెలల్లో తుంగమడుగుకు రోడ్డు వేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చి గ్రామం వైపు రావడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రజలకు ఆశ చూపి వదిలేశాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా నెల రోజుల్లో రోడ్డు నిర్మించకుంటే వందలాది మందితో నిరసన చేపడుతానని హెచ్చరించారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారంపై అసెంబ్లీలో ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజ్‌కుమార్, రాజు, అంజన్న, నరేందర్, తదితరులు ఉన్నారు.

# ఆశాలపై లాఠీచార్జి అమానుషం

**యూనియన్ ఆధ్వర్యంలో నిరసనలు**

బెల్లంపల్లి/కన్నెపల్లి/బెజ్జూర్, మార్చి 25 : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు హైదరాబాద్ వెళ్లిన ఆశ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేసి అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని తెలంగాణ ఆశ కార్యకర్తల యూనియన్(సీఐటీయూ) నాయకులు అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా రూ. 18వేలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చల్లూరి దేవదాస్, నాయకులురాళ్లు రాణి, ఎం.భాగ్యలక్ష్మి, కే.నసీమా, ధనలక్ష్మి, లత, సుజాత, అరుణ, మాణిక్యం, పరమేశ్వరి, స్రవంతి, స్వరూప, భారతి, గంగారాణి, రజియా, స్వరూపా రాణి, సరిత, శ్యామల పాల్గొన్నారు.

### అంబేద్కర్ విగ్రహానికి వినతి

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కన్నెపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రులను కలిసి సమస్యలను విన్నవించేందుకు వెళ్లిన తమను అక్రమంగా అరెస్టు చేసి దురుసుగా ప్రవర్తించడం హేయమైన చర్య అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలో గాంధీ విగ్రహం ముందు ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఆశ కార్యకర్తల యూనియన్ మండల అధ్యక్షురాలైన సరోజన మాట్లాడుతూ హెల్త్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన శాంతియుతంగా నిరసన తెలిపిన ఆశ కార్యకర్తలపై పోలీసులు లాఠిచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



బెల్లంపల్లి : అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, ఆశ కార్యకర్తలు

చెన్నూర్‌లో పట్టు మేళాను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



# టాసర్ పట్టు పరిశ్రమకు ప్రోత్సాహం అందిస్తాం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- చెన్నూర్‌లో టాసర్ రేషం(పట్టు) కృషి మేళా ప్రారంభం

చెన్నూర్ టౌన్, మార్చి 25 : చెన్నూర్ ప్రాంతంలోని టాసర్ పట్టు రైతులకు ప్రోత్సాహం అందిస్తామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూర్‌లో ఉద్యానవన-పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రాంచీలోని సీఎస్‌బీ-సీటీఆర్‌టీఐ సహకారంతో ఏర్పాటు చేసిన టాసర్ రేషం(పట్టు) కృషి మేళాను కలెక్టర్ ప్రారంభించారు. దసలిపట్టు గూళ్ల నిల్వ భవనం (గిడ్డంగి)ని ప్రారంభించారు. అనంతరం మోడల్ కొకూన్ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జార్ఖండ్‌లోని రాంచీలో గల సీటీఆర్ అండ్‌టీఐ సంచాలకుడు డా.ఎన్.బాలాజీ చౌదరి, ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో గల బీటీఎస్‌వో సంచాలకుడు డా.సెల్వకుమార్, జిల్లా ఉద్యానవన- పట్టు శాఖ సంయుక్త సంచాలకురాలు ఎం.లత, వరంగల్ జిల్లా సంయుక్త సంచాలకురాలు జీ.అనసూయతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం రూ.40 లక్షల అంచనా వ్యయంతో డీఎంఎఫ్‌టీ నిధుల కింద పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో గిడ్డంగిని ప్రారంభించినట్లు తెలిపారు. టాసర్ పట్టు కృషి మేళా కార్యక్రమాన్ని రైతుల కోసం నిర్వహించినట్లు పేర్కొన్నారు. టాసర్ పట్టు ఉత్పత్తి చేసే రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామన్నారు. పట్టు వస్త్రాల తయారీ, ఫ్యాబ్రిక్స్ తయారీ అభివృద్ధి చేయాలని, దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చని తెలిపారు. టాసర్ హోస్ట్ ప్లాంటేషన్ కోసం పోడు, అటవీ భూములను ఉపయోగించుకోవాలని సూచించారు. దేశంలో టాసర్ ముడి పట్టు ఉత్పత్తిలో దశాబ్ద కాలంగా సైంటిస్ట్ డీ.ఎంవీకే భగవానులు నేతృత్వంలోని బీఎస్ఎంటీసీ చెన్నూర్ అత్యుత్తమ సేవలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం టాసర్ సిల్క్ రీలింగ్ యంత్రాల పనితీరును పరిశీలించారు. చెన్నూర్ ప్రాంతంలో అత్యుత్తమ, నాణ్యమైన టాసర్ పట్టు ఉత్పత్తి చేయడంపై రాంచీలోని సీటీఆర్‌టీఐ, సీఎస్‌బీ సంచాలకుడు అభినందించారు. అనంతరం పట్టు గూళ్ల ఉత్పత్తి, టాసర్ గుడ్ల ఉత్పత్తిలో ఉత్తమ రైతులతో పాటు అధికారులు, విరమణ పొందనున్న సెంట్రల్ సిల్క్ బోర్డు చెన్నూర్ ఎంవీకే భగవానులును కలెక్టర్, సంచాలకులు సత్కరించారు. ప్రశంసా పత్రాలు జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో సెరీకల్చర్ ఏడీ రాథోడ్ పార్వతి, ములుగు ఆర్ఎస్ఆర్ఎస్ డా.జీ రాఘవేంద్ర, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నిలిచిపోయిన డ్రైనేజీ నీటిలో నిలబడి నిరసన తెలుపుతున్న స్థానికులు

# డ్రైనేజీతో తిప్పలు.. కాలనీవాసుల నిరసన

సీసీసీ నస్పూర్, మార్చి 25: సీసీసీ ఆర్‌కే-5కాలనీలో డ్రైనేజీ నీరు నిలిచి ఇండ్లల్లోకి చేరుతున్నదని, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన చేశారు. మంగళవారం డ్రైనేజీ నీటిలో నిలబడి నిరసన తెలిపారు. సీసీసీలోని ఆర్‌కే-5కాలనీ సింగరేణి క్వార్టర్ల పక్కన ఇళ్లు కట్టుకుని నివాసముంటున్న ప్రాంతంలో మున్సిపల్ ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణంతో ఏర్పడిన గుంతలో ఇటీవల వర్షపు నీరు, డ్రైనేజీ నీరు వచ్చి చేరడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వీరమల్లు, కమల, దాస్, కొమురన్న, రజిత, రాజేశ్వరి, ప్రమీల, భాగ్యలక్ష్మి, మీణ, సబిత, ఎల్లయ్య, శ్యామ్, సత్తయ్య, రాజయ్య, కనకలక్ష్మి, నరేందర్, అశోక్ పాల్గొన్నారు.